

తాండూర్: బర్లగూడెంలో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు పూలమాల వేసి స్వాగతం పలుకుతున్న మహిళ



భీమిని : మద్దతు తెలుపుతున్న గ్రామస్తులు

# మళ్లీ గెలిపిస్తే ప్రజా సేవకే అంకితమవుతా

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం చిన్నయ్య
- తాండూర్, బెల్లంపల్లి మండలాల్లోని గ్రామాల్లో ఇంటింటా ప్రచారం



తాండూర్ : బర్లగూడెం గ్రామస్తులతో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లిరూరల్, నవంబర్ 15: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలందరూ మంచి మనసుతో దీవించి మళ్లీ గెలిపిస్తే ప్రజల మధ్యలో జీవిస్తూ ప్రజాసేవకే అంకితమవుతానని బెల్లంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి దుర్గం చిన్నయ్య అన్నారు. గురువారం మండలంలోని బూదాకుర్ధు, చాకేపల్లి గ్రామాల్లో ఆయన ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా బూదాకుర్ధు గ్రామంలో దుర్గం చిన్నయ్యకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం వచ్చాకే ప్రజలకు రైతు బంధు, రైతు బీమా, 24 గంటల పాటు ఉచిత విద్యుత్, కల్యాణ లక్ష్మి, తదితర పథకాలతో నాణ్యమైన విద్య అందించారని తెలిపారు. బూదాకుర్ధులో యువకుల కోసం రూ 2.86 కోట్లతో స్టేడియం పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మహిళల కోసం రూ 4 వందలకే వంటగ్యాస్ అందించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. గ్రామంలో నిర్మిస్తున్న ఆలయానికి రూ.18 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. కరోనా సమయంలో బెల్లంపల్లిలో అందుబాటులో ఉండి ప్రజలకు సేవలందించానని చెప్పారు. కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్ చెన్నూర్‌లో 5 సార్లు ఓటమి పాలై బెల్లంపల్లికి ఎన్నికల మకాం మార్చారని ఎద్దేవా చేశారు. బెల్లంపల్లిలో వినోద్, చెన్నూర్‌లో వివేక్ గెలిస్తే ప్రజలకు ఏమాత్రం అందుబాటులో ఉండరని చెప్పారు. అన్నదమ్ములిద్దరికీ 16 రాష్ట్రాల్లో అనేక కంపెనీలున్నప్పటికీ తెలంగాణ ప్రాంత ప్రజలకు ఎక్కడా ఉద్యోగాలు కల్పించలేదని ఆరోపించారు. వనరులున్నా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాపై వారికి ఎంతమాత్రం ప్రేమ లేదన్నారు. కేవలం ఆస్తులు కూడబెట్టుకునేందుకే వారు రాజకీయాలు చేస్తున్నారన్నారు. డబ్బుల సంచులతో వచ్చి బెల్లంపల్లి, చెన్నూర్ ప్రాంతాల్లో నాయకులను కొనుగోలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్మానికి అధర్మానికి మధ్య జరుగుతున్న ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి న్యాయం వైపై ఓటేసి తనను గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. అనంతరం చాకేపల్లిలో దుర్గం చిన్నయ్య బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. హఠాత్తుగా స్వల్ప అస్వస్థతకు గురికావడంతో ఆయనను హుటాహుటిన బెల్లంపల్లి సింగరేణి ఏరియా దవాఖానకు తరలించి, మెరుగైన చికిత్స కోసం మంచిర్యాలకు తీసుకెళ్లారు. ఎమ్మెల్యే వెంట జడ్పీవైస్ చైర్మన్ టీ సత్యనారాయణ, ఎంపీపీ జీ శ్రీనివాస్, సర్పంచులు వేముల క్రిష్ణమూర్తి, శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు గణేశ్‌గౌడ్,మండల ఉపాధ్యక్షురాలు రాణి, ఎంపీటీసీ పి.సుభాష్‌రావ్,బీఆర్ఎస్ నాయకులు కే.లక్ష్మణ్, బీ.అర్జయ్య ,జీ.వెంకటేశ్వర్‌గౌడ్ తో పాటు పలువురు నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



తాండూర్: గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

**నన్ను గెలిపించండి ..సమస్యలు పరిష్కరిస్తా..**

తాండూర్, నవంబర్ 16 : అధికారంలోకి రాగానే మిగిలి ఉన్న ప్రజాసమస్యలు పూర్తిగా తీరుస్తానని ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం చిన్నయ్య హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని పల్లెల్లో రైతులు, రోజువారి కూలీలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఎమ్మెల్యే చిన్నయ్య మార్నింగ్ వాక్‌లో పాల్గొంటూ బీఆర్ఎస్ పార్టీ ప్రవేశ పెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, మ్యానిఫెస్టోను వివరిస్తూ బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం చిన్నయ్య గురువారం మార్నింగ్ వాక్ ప్రచారం చేశారు. ఇందులో భాగంగా తాండూర్ మండలం బోయపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని బర్లగూడెంలో బుగ్గ దేవస్థానం చైర్ పర్సన్ మాసాడి శ్రీదేవి, సర్పంచ్ భీమ సునీత, స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి గ్రామంలో ప్రజలతో సమావేశమయ్యారు. గ్రామంలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్‌కి ఓటు వేసి తనను గెలిపించాలని దుర్గం చిన్నయ్య కోరారు. రైతులు, మహిళలు, విద్యావంతులు, యువత నుంచి అనూహ్య స్పందన లభిస్తుందని, తెలంగాణ రాష్టంలో ప్రతి ఒక్కరూ తెలంగాణ సాధించి సుస్థిర, సురక్షితమైన పాలన అందించిన కేసీఆర్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. బర్లగూడెం గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో తనను మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మాసాడి నారాయణ, భీమ రాజ్‌కుమార్, ఉప సర్పంచ్ రౌతు వెంకటేశం, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రుకుం తిరుపతి, నాయకులు వేల్పుల శంకర్, రుకుం ప్రసాదు, గుగ్గిళ్ళ రాజబాబు, ముదాం రఘు, దాడి బాలాజీ, కొమ్మ మల్లేష్, ఇస్తారి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

**బీఆర్ఎస్‌కు మామిడిపల్లి గ్రామస్తుల మద్దతు**

భీమిని, నవంబర్ 16: మండలంలోని మామిడిపల్లి గ్రామస్తులు బీఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. గురువారం గ్రామంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నిరంజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు ఈ మేరకు నిర్ణయించారు. గ్రామంలో చేసిన అభివృద్ధి, సంక్షేమానికి బంగారు బాటలు వేసిన పార్టీకి పూర్తి మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. భారీ మెజార్టీతో దుర్గం చిన్నయ్యను గెలిపించుకుంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు ముత్యం సుదర్శన్, సర్పంచ్ ఎల్లా గౌడ్, నాయకులు సూరం మల్లేశ్, గ్రామస్తులు, యువకులున్నారు.

## ఎన్నికల నియమావళిని పాటించాలి

- ఎన్నికల పరిశీలకులు బిశ్వజిత్ దత్తా, ఇలాంగో

బెల్లంపల్లి, నవంబర్ 16:ఎమ్మెల్యే అభ్యర్థులు తప్పకుండాఎన్నికల నియమావళిని పాటించాలని బెల్లంపల్లి సాధారణ ఎన్నికల పరిశీలకుడు బిశ్వజిత్ దత్త, పోలీసు విభాగం పరిశీలకుడు ఇలాంగో సూచించారు. ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయం ఆవరణలో గురువారం రిటర్నింగ్ అధికారి రాహుల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అభ్యర్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. అభ్యర్థులకు ఎన్నికల కోడ్‌కు సంబంధించి పలు సూచనలు చేశారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం చిన్నయ్యతో పాటు మరో 12 మంది ఎమ్మెల్యే అభ్యర్థులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే అభ్యర్థుల సమావేశంలో పాల్గొన్న ఎన్నికల పరిశీలకుడు బిశ్వజిత్ దత్త


## ఓటర్ స్లిప్‌ల పంపిణీ



చౌటపల్లిలో ఓటర్ స్లిప్ పంపిణీని పరిశీలిస్తున్న ఎంపీవో సత్యనారాయణ

తాండూర్, నవంబర్ 16 : అసెంబ్లీ ఎన్నికల్లో అర్హులందరూ ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా వారి పోలింగ్ కేంద్రం, బూత్‌ల వివరాలతో కూడిన ఓటర్ స్లిప్ లను ఆయా గ్రామాల్లో ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారుల ఆధ్వర్యంలో బీఎల్వోలు గురువారం పంపిణీ చేశారు. ఓటర్ స్లిప్‌లతో పాటు ఓటింగ్ విధానంపై పలు సమాచారాన్ని అందిస్తున్నారు. మండలంలోని చౌటపల్లిలో ఓటర్ స్లిప్‌ల పంపిణీని ఎంపీవో సత్యనారాయణ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మండలంలో ఓటరు స్లిప్‌ల పంపిణీ కార్యక్రమం ఈ నెల 23వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు.

## రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సైదులు, పీఈటీ వామన్

బెల్లంపల్లిరూరల్,నవంబర్ 15: మంచిర్యాల బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అండర్ 14 విభాగం జోనల్‌స్థాయి పోటీల్లో అత్యంత ప్రతిభ చూపి గజ్వేల్‌లో శుక్రవారం నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు బెల్లంపల్లి సీవోఈ కి చెందిన విద్యార్థులు ఐనాల భగవత్ (7 వ తరగతి), చందా అక్షిత్ (9 వ తరగతి) లు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఐనాల సైదులు తెలిపారు. వీరిని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ పరిమళ, పీఈటీలు వామన్, రాకేష్‌లతో పాటు కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు అభినందించినట్లు ఆయన తెలిపారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన

కాసిపేట, నవంబర్ 16 : కాసిపేట మండలంలోని సాలేగూడ, వెంకటాపూర్, రొట్టెపల్లి పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో ఎంఎ అలీం పరిశీలించారు. ఓటరు స్లిప్పుల పంపిణీకి సంబంధించి పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీంతో పాటు గ్రామ పంచాయతీలో చేపడుతున్న అభివృద్ధి పనులను సైతం పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులున్నారు.

## రాష్ట్ర స్థాయిలో ముత్యంపల్లి విద్యార్థుల ప్రతిభ



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు, గైడ్ టీచర్ శాంకరి

కాసిపేట, నవంబర్ 16 : హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి కళోత్సవాల్లో కాసిపేట మండలంలోని ముత్యంపల్లి విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఇండి జీనియస్ టాయ్స్ అండ్ గేమ్స్‌లో బాలుర విభాగంలో నరేందర్ కొబ్బరి పీచు, చెక్క పొట్టు వెదురు బొంగులతో బొమ్మలను తయారు చేసి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాడు. బాలికల విభాగంలో ఎన్ బిందు ప్రియ తోలు బొమ్మల ప్రదర్శన ఇచ్చి ప్రథమ స్థానంలో నిలిచింది. వృథా దుస్తులతో బొమ్మలు చేసి ఓటు విలువైనది, నోటు కోసం ఓటు అమ్ముకోవద్దని, ప్రతి పౌరుడూ బాధ్యతగా ఓటు వేసి ఓటు హక్కు వినియోగించుకోవాలని తోలు బొమ్మలాట ద్వారా ప్రదర్శన ఇచ్చి ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ మేరకు రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు డిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు ప్రథమ బహుమతులు సాధించిన విద్యార్థులు, గైడ్ టీచర్ బండ శాంకరి జేడీ రాజీవ్ చేతుల మీదుగా బహుమతులు స్వీకరించారు.